

అలరించిన మ్యూజికల్ నైట్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అయోధ్య మైదానంలో నిర్వహించిన మ్యూజికల్ నైట్ ఆహూతులను అలరించింది. గాయని మధుప్రియ, సౌజన్య భాగవతుల, మా టీవీ సూపర్ సింగర్ నాయుడు, జానకిరాం.. పలు సినిమా పాటలతో ఆకట్టుకున్నారు. సౌజన్య పాడిన పలు మెలోడీ సాంగ్స్ యువతలో ఉత్సాహాన్ని నింపాయి. మధుప్రియ పాడిన పిల్లా మెల్లగా వచ్చింది పాట ఓలలాడించింది. రాను బొంబాయికి రాను.. అంటూ మధుప్రియ పాడిన పాట కుర్రకారును ఉర్రూతలూగించింది. సింగర్స్ వచ్చినా అతిథులు ఆలస్యంగా రావడంతో కార్యక్రమం రాత్రి 8:30 గంటలకు ప్రారంభమైంది. కొద్దిసేపటికే వర్షం పడటంతో కార్యక్రమం రద్దయింది.



పాట పాడుతున్న మధుప్రియ



ఉత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి అనిత

విజయనగరం ఉత్సవాలు వైభవంగా ఆరంభమయ్యాయి. జానపద కళలు, కళారూపాల కనువిందు ఓవైపు.. మైమరపింపజేసేలా శాస్త్రీయ సంగీతాలు, నృత్యరూపకాలు మరోవైపు.. ఆకట్టుకునేలా విచిత్ర వేషధారణలు, సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే నాటక ప్రదర్శనలు ఇంకో వైపు.. విజ్ఞానం పంచే వైజ్ఞానిక ప్రదర్శన, అద్భుతంగా అలరించిన కవిసమ్మేళనం.. ఇలా ఎన్నో విశేషాలు దర్శనమిచ్చాయి. విజయనగర సాంస్కృతిక వైభవానికి దర్పణం పట్టాయి. గత విజయనగర వైభవాన్ని చాటిచెప్పేలా ఉత్సవ ఆరంభ వేడుక శోభాయాత్ర శోభాయమానంగా సాగింది.

ఉత్సవం.. వైభవం



ఆకట్టుకునేలా కళాకారుల నృత్య ప్రదర్శన

- ఘనంగా విజయనగరం ఉత్సవాలు ప్రారంభం
- శోభాయమానంగా శోభాయాత్ర
- ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాలు



గుర్రపుబగ్గీపై రాజువేషధారణలో వ్యక్తి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కోట, కంటోన్మెంట్

విజయనగరం ఉత్సవాల ప్రారంభానికి సంకేతంగా పైడితల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ జెండా ఊపి ర్యాలీ (శోభాయాత్ర)ని ప్రారంభించారు. ఈ ర్యాలీలో స్వాగత శకటం, రోలర్ స్కేటర్లు, అమ్మవారి కలశాలు, తప్పెటగుళ్లు, థింసా నృత్యం, పులి వేషాలు, కేరళ వాయిద్యాలు, కర్రసాము, కొమ్మ కోయ డాన్స్, బిందెల డాన్స్, గరగల డాన్స్, చెక్క భజన, గంగిరెద్దులు, జముకుల బృందం.. ఇలా కళారూపాలతో ర్యాలీ సాగింది. కత్తి సాము, కర్ర సాము, గురజాడ అప్పారావు వేషధారణలతో, రాజుల కాలాన్ని గుర్తుచేసే గుర్రపు బగ్గీలో వేషధారణలు ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా మంత్రి అనిత.. పైడితల్లమ్మ వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన థింసా నృత్యంలో మంత్రి అనిత, ఎమ్మెల్యే అదితి మహిళలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కోట వద్ద ప్రముఖులు ఆసీనులై కళారూపాలను తిలకించారు. ఈ సందర్భంగా విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలని ఇటువంటి పండు గలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, ఎస్‌పి ఎ.ఆర్. దామోదర్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, జెసి ఎస్.సేతు మాధవన్ పాల్గొన్నారు.



థింసా నృత్యం చేస్తున్న మంత్రి అనిత



కోలాటం



పులివేషాలతో..



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న సాహితీ వేదిక కార్యక్రమాలు

లేడీస్ క్లబ్ ప్రాంగణంలో సంస్కృత కళాశాల ప్రిన్సిపల్ జి.జనార్ధననాయుడు అధ్యక్షతన నిర్వహించిన సాహితీ వేదిక కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. కట్టమూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శ్రీనాథ విజయం నాటకం, చీకటి దివాకర్, సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కవిసమ్మేళనం విశేషంగా ఆకట్టుకున్నాయి.



కాళీమాత వేషధారణలో..

అలరించిన జానపద కళలు

ఉత్సవాల్లో బాల భవన్ నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం కళాకారులు సంప్రదాయ ప్రాచీన జానపద కళలను ప్రతిబింబించేలా ప్రదర్శనలిచ్చారు. అయ్యన్నపేట, ధర్మపురి మహిళా బృందాల కోలాటం, ధర్మపురి బృందం చెక్కభజన, కర్రసాము, కత్తిసాము, పులివేషాలు, థింసా నృత్యం ఆకట్టుకున్నాయి.



గురజాడ వేషధారణలో విద్యార్థి

లేజర్ షో కనువిందు

స్థానిక కోట వద్ద ఏర్పాటుచేసిన లేజర్‌షో కనువిందు చేసింది. ఈ లేజర్‌షోను ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రారంభించారు. దీనిని తిలకించేందుకు భారీగా జనం తరలివచ్చారు.

☞ అయోధ్యా మైదానంలో పశు సంవర్ధక శాఖ జెడి కె.మురళీకృష్ణ పెట్‌షో ఏర్పాటుచేశారు. 35 రకాల కుక్క జాతులు , విదేశీ పక్షులు, లవ్ బర్డ్స్, కుందేళ్ళు, పుంగనూరు ఆవులను ప్రదర్శించారు.

☞ కోటలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌లో విజయనగరం జిల్లా మహనీయులు, వివిధ యుద్ధాల్లో అమరులైన జవాన్లకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి నివాళులర్పించారు.

పుష్ప ప్రదర్శన ప్రారంభం

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక మాన్సాస్ మైదానంలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శనను కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ప్రారంభించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పుష్పాలను ఆసక్తిగా తిలకించారు. కూరగాయలతో ఏర్పాటు చేసిన వినాయకుని ఆకృతి వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. సేతు మాధవన్, ఉద్యాన శాఖ డిడి కె.చిట్టిబాబు, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, ఎపిడి సావిత్రి పాల్గొన్నారు.



పుష్పప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్, జెసి



తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన



అబ్బురపరిచిన సాంస్కృతిక కార్యక్రమాలు

మహారాజా సంగీత కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. వేదిక ఇన్‌ఛార్జులు కవిత, ఎస్.జానకమ్మ, సంగీత కళాశాల ప్రిన్సిపల్ మండపాక నాగలక్ష్మి జ్యోతిని వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. 34 బృందాలు వారి కళలను ప్రదర్శించాయి. నాదస్వరం, గాత్రం, వీణ, ఫ్లూట్, వయోలిన్, మృదంగంతో పాటు కూచిపూడి, భారత నాట్యం ప్రదర్శనలు ఉన్నాయి. ఎస్.జానకమ్మ అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు.





కర్రసాము చేస్తున్న క్రీడాకారులు; కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు



కేరళ వాయిద్యాలు



ఉత్సవ ర్యాలీలో రోటర్ స్కేటర్లు

నేడు తొలేళ్ల ఉత్సవం



విద్యుత్తు కాంతులతో పైడితల్లమ్మ ఆలయం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లమ్మ జాతరలో ప్రధాన ఘట్టమైన తొలేళ్ల ఉత్సవం సోమవారం అర్ధరాత్రి జరగనుంది. ఉదయం నుంచి ప్రజలు ఘటాలతో అమ్మవారి దర్శనం కోసం భారీగా తరలిరానున్నారు. దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. ఆలయ ధర్మకర్త, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు కూడా అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. తొలేళ్ల ఉత్సవం రోజున అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో యాత్రికులు తరలిరానున్నారు. ఈ సందర్భంగా అర్ధరాత్రి అమ్మవారి చదురుగుడి నుంచి వేద పండితులు మంత్రోత్సవాల మధ్య ఘటాలు.. మూడు లాంతర్లు మీదుగా కోట వరకు వాయిద్యాలు, పులివేషాలు నడుమ చేరుకుంటాయి. అక్కడ అమ్మవారి పూజారి పండగ విశేషాలను యాత్రికులకు వివరించనున్నారు. అనంతరం వరి విత్తనాలను చల్లనున్నారు. రైతులు ఆ విత్తనాలు తీసుకునేందుకు పోటీ పడుతుంటారు. ఆ విత్తనాలు పొలంలో నాటితే మంచి పంటలు పండుతాయని రైతుల నమ్మకం. ఈ సందర్భంగా నగరంలో ప్రజలు మేల్కొని ఉండటంతో వారికి వినోదాన్ని అందించడం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

యాత్రికులతో సంయమనం పాటించండి

ఎస్‌పి దామోదర్



మాట్లాడుతున్న ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మ పండగ సందర్భంగా యాత్రికులతో సంయమనం పాటించాలని ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్.. పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. బందోబస్తు నిమిత్తం వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి నిర్వహించాల్సిన విధులు, యాత్రికులతో వ్యవహరించాల్సిన తీరు, తీసుకోవాల్సిన భద్రత చర్యలపై ఎస్‌పి స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగను తిలకించేందుకు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుండి ప్రజలు జిల్లాకు వచ్చే అవకాశం ఉందని, ఎవరితోనూ గొడవ పడవద్దని సిబ్బందికి సూచించారు. వారితో మాట్లాడే సమయంలో సంయమనం పాటించాలని, ఏదైనా ఇబ్బందులు తలెత్తితే మీకు ఇన్‌ఛార్జులుగా వ్యవహరించే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. సిరిమానోత్సవంలో ప్రెజర్ పాయింట్లు అయిన పాత సోనియా జంక్షన్, కస్పా జంక్షన్, గురజాడ రోడ్డు వంటి ప్రాంతాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా బాధ్యతలను ఉల్లంఘిస్తే, అందుకు బాధ్యులైన వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ ఎఎస్‌పి జి.నాగేశ్వరరావు, చింతూరు ఎఎస్‌పి పంకజ్ కుమార్ మీనా, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, జి.భవ్యరెడ్డి, ఎస్.రాఘవులు, ఎం.వీరకుమార్, ఇ.కోటిరెడ్డి, బి.సీతారాం, షేక్ షాబాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ఉత్సవాలు సందర్భంగా విజ్జీ మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ఆదివారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రారంభించారు. అనంతరం ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, చదరంగం, టెన్నిస్ పోటీలను ప్రారంభించారు. ఉత్సాహంగా ప్రారంభమైన పోటీలలో జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ శ్రీధర్, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం

విజయనగరం టౌన్ : విజయనగరం ఉత్సవాల నేపథ్యంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. స్థానిక మూడులాంతర్ల సమీపంలో ఉన్న విపణికల్ప కాంప్లెక్స్ వద్ద వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖుల ఫొటోలను ప్రదర్శించారు. ప్రముఖుల విశేషాలను ప్రజలకు తెలిపేందుకు ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశామని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు.

ఆలోచింపజేసిన వైజ్ఞానిక ప్రదర్శన



ప్రదర్శనలో విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్,కోట, కంటోన్మెంట్

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా కోట లోపల ఏర్పాటుచేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే అదితి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు చిరంజీవిరావు, గాదె శ్రీనివాసులు నాయుడుతో కలిసి ప్రదర్శనను మంత్రి సందర్శించారు. ప్రదర్శనలో ఉంచిన ప్రాజెక్టులను, నమూనాలను ఆసక్తిగా తిలకించారు. వాటి గురించి డిఇఒ మాణిక్యంనాయుడు వారికి వివరించారు. భోగాపురం విమానాశ్రయం, భారీ ప్రాజెక్టుల నమూనాలు, డ్రోన్లు, క్రాఫ్ట్ ప్రదర్శన, నాణేల ప్రదర్శన, ఆర్ట్ ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. వాటి గురించి విద్యార్థులు సందర్శకులకు సమగ్రంగా వివరించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించారు. ఇంటర్ విద్యాశాఖ అధికారి ఎస్.తవిటినాయుడు, డిప్యూటీ డిఇఒ వెంకటరమణ పాల్గొన్నారు.



ప్రదర్శనలో చంద్రయాన్ నమూనా

ఆనంద గజపతి ఆడిటోరియంపై

ఓ ప్రజాప్రతినిధి కన్ను

- సొంతానికి వాడుకునేందుకు పన్నాగం?
- ఉత్సవాల వేళ కళావిహీనం

నాడు నేడు





విజయనగరం ఉత్సవాల సందర్భంగా గతంలో విద్యుత్తు కాంతులతో ఆనందగజపతి ఆడిటోరియం, ప్రస్తుతం కళావిహీనంగా ఇలా..

విజయనగరం అనగానే గుర్తొచ్చేది కళల వాసన, కవితల ఊసు, సంగీత సభల ఘోష, సాహిత్య సౌరభం. ఇంతటి సాంస్కతిక చరిత్ర కలిగిన నగరానికి తలమానికంగా నిలిచింది ఆనంద గజపతి ఆడిటోరియం. ఇది కేవలం ఒక భవనం కాదు సుమా..! తరతరాల కళాకారుల కళల వేదిక, వినిపించిన ప్రతి శబ్దం ఒక చరిత్రే. కానీ ఇప్పుడు... ఈ వేదికపై ఓ ప్రజా ప్రతినిధి కన్ను పడిందట. అందుకే ఉత్సవాల వేళ విద్యుత్ కాంతులీనుతూ వీణుల విందును, నాట్యమయూరాలను, సాహిత్య పరిమళాలను అందించే ఆడిటోరియం.. నేడు కళావిహీనంగా మారింది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరంలో సాంస్కృతిక కార్యక్రమాలు, సాహిత్య సభలు, సంగీత కచేరీలు, కవితా సమ్మేళనాలు, సన్మానాలు, సత్కారాలు జరుగుతున్నాయంటే టక్కున గుర్తుకు వచ్చేది ఆనందగజపతి ఆడిటోరియం. ఎంతోమంది కళాకారులు, సాహితీవేత్తల ప్రస్థానం ఈ వేదిక నుంచే ప్రారంభమైందనడంలో సందేహం లేదు. సినీ గాయకుడు బాల సుబ్రమణ్యం, గాన కోకిల పి.సుశీల వంటివారెందరో ఇక్కడ సన్మానాలు, సత్కారాలు అందుకున్నారు. కొన్ని సందర్భాల్లో రాజకీయ ప్రసంగాలకు కూడా ఇదే వేదికగా నిలిచింది. ఇంతటి ప్రాచుర్యం పొందిన ఆడిటోరియాన్ని 1971లో అప్పటి రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి (పరవాడ ఎమ్మెల్యే) బాటం శ్రీరామ్మూర్తి ప్రభుత్వ నిధులతో నిర్మించారు. కళలకు పెద్దపీట వేయడం, అభ్యుదయ భావజాల వ్యాప్తి దీని ముఖ్య ఉద్దేశం. అప్పట్లో దీని నిర్వహణ మాత్రమే మాన్సాస్ ట్రస్టుకు అప్పగించారు. నిర్వహణ భారంగా భావించిన ట్రస్ట్ 1984లో నాటి కలెక్టర్‌కు మాన్సాస్ తిరిగి అప్పగించింది. నాటి నుంచి దీనిపై వచ్చే అద్దెలు, నిర్వహణ అంతా కలెక్టర్ అకౌంట్ ద్వారానే నడిచేది. 2023లో జరిగిన ఉత్సవాల అనంతరం కేవలం నిర్వహణ వరకు నగరపాలక సంస్థకు అప్పగించినా.. అకౌంట్స్ మాత్రం కలెక్టర్ ద్వారా నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీని నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేయడంతో నిరుపయోగంగా మారింది.

ఇంతటి చరిత్ర, ప్రాధాన్యత గల ఆడిటోరియంపై ఓ ప్రజాప్రతినిధి కన్ను పడటమే ఇందుకు కారణమట. ఎలాగైనా సొంతం చేసుకోవాలని భావించిన ఆ ప్రతినిధి తన రాజకీయ పలుకుబడి, అధికార బలాన్ని ఉపయోగించి కొద్ది కాలంగా ఆడిటోరియం ఆలనా పాలన లేకుండా చేశారట. ఇది జనం నుంచి, ముఖ్యంగా కళాకారులు, సాహితీ సంఘాల నుంచి వినిపిస్తున్న మాట. ఈ నేపథ్యంలోనే ఇందులోని ఫర్నీచర్ పాడైనా పట్టించుకోలేదు. దాదాపు రూ.18 లక్షల బిల్లులు చెల్లించకపోవడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ఉత్సవాల వేళ కనీసం చారిత్రక స్మృతులను నెమరువేసుకునేందుకైనా అలంకరించలేదు.

వాస్తవానికి పైడితల్లమ్మ పండగ, విజయ నగరం ఉత్సవాలకు రెండు నెలల ముందు నుంచే నగరంలో హడావుడి కనిపిస్తుంది. రోడ్ల మరమ్మతులు మొదలుకుని, విద్యుత్ అలంకరణలు, పెయింటింగ్ వంటివి చేపడతారు. ఇందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ సొమ్ముతో ఉత్సవాల నిర్వహణలో వేదికలుగా గుర్తించే వాటిని ప్రత్యేకంగా ముస్తాబు చేస్తారు. ఇందులో ప్రప్రథమైన వేదిక ఆనంద గజపతి ఆడిటోరియం. ఉత్సవాల వారసత్వంలో ప్రారంభం, ముగింపు రెండూ ఇక్కడి నుంచే మొదలు పెట్టేవారు. గత ఏడాది ఈ సంప్రదాయానికి స్వస్తి పలికి అయోధ్య మైదానానికి మార్పుచేశారు ఈ ఏడాది ఏకంగా తలుపులు మూసేశారు. చిత్త శుద్ధి ఉంటే ప్రభుత్వానికి గానీ, విఎంఆర్‌డిఎ, మున్సిపాల్టీలకు నిధులు కేటాయించడం ఏ పాటి? దీన్ని బట్టి ఉద్దేశ పూర్వకంగానే పక్కన పెట్టారని అర్థమవుతోంది.

ఈ సంగతి కాస్త అటుంచితే..., ఎన్నో గొంతులకు, సాహితీ సవ్వడికి వేదికగా నిలిచే ఈ వేదిక (ఆడిటోరియం) మూసివేత గాయకుల గుండెకు గాయం చేసింది. సంగీత స్వరానికి కళ్లెం వేసినట్టైంది. సాహితీలోకం చిన్నబోతోంది. ఉరకలేసిన పద్యాలు, గానాలు, జానపద గీతాలు... ఇవన్నీ ఇప్పుడు గుమ్మానికి తాళం వేసిన శబ్దాన్ని మాత్రమే వింటున్నాయి. ఇంతటి వేదికను కనుమరుగు చేసేందుకు బరితెగించడమంటే ప్రజల భావాలకు సంకెళ్లు వేయడమే. ఇంతటి కళామతల్లిని పున:ప్రారంభించాలంటే కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, అభ్యుదయవాదులు, సంగీత అభిమానులు ఏకం కావాల్సిందే.

ముందుకు సాగని విఎంఆర్‌డిఎ ప్రతిపాదనలు

పూర్వకాలంలో నిర్మించిన ఆనంద గజపతి ఆడిటోరియం భవనం, ఖాళీ స్థలం సుమారు మూడు ఎకరాల్లో ఉంది. పెరుగుతున్న అవసరాలు, సాంకేతికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని గత కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ హయాంలోనే అధునాతన పద్ధతిలో కన్వెక్షన్ హాల్స్ నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. ఇందులోనూ ఓ ప్రజాప్రతినిధి మితిమీరిన జోక్యం వల్ల ఆ ఫైల్ అక్కడితో ఆగిపోయిందట. దీని సంగతి పక్కన బెడితే కనీసం విఎంఆర్‌డిఎ సాయంతో తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు కూడా చొరవ చూపకపోవడం గమనార్హం.

సిరిమానోత్సవానికి పటిష్ట బందోబస్తు

◆2600 మంది పోలీసులతో ఏర్పాటు ◆సామాన్యుల దర్శనాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు ◆17 చోట్ల వాహనాల పార్కింగ్‌కు అవకాశం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మ పండగ నేపథ్యంలో పోలీసుశాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. సిరిమానోత్సవాన్ని శాంతియుతంగా నిర్వహించేందుకు సుమారు 2,600 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవంలో సామాన్య భక్తుల దర్శనాలకు ప్రాధాన్యత కల్పిస్తూ, ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఎస్‌పి ఎఆర్ దామోదర్ చర్యలు చేపట్టారు. ప్రధాన ఆలయం, వనం గుడి వద్ద బందోబస్తు నిర్వహించే సిబ్బందికి షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. బందోబస్తులో ముగ్గురు అదనపు ఎస్‌పిలు, 15 మంది డిఎస్‌పిలు, 40మంది సిఐలు/ఆర్ఎస్ఐలతోపాటు సుమారు 2,600 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తుగా వినియోగిస్తున్నారు. అమ్మవారి సిరిమానోత్సవ బందోబస్తు విధులను నిర్వహించేందుకు పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విశాఖపట్నం సిటీతోపాటు ఇతర జిల్లాల నుండి కూడా పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించారు.



బ్యాగ్‌లో తనిఖీ చేస్తున్న పోలీసు

మొత్తం బందోబస్తును, కమాండ్ కంట్రోల్ నుండి పర్యవేక్షించి, అవసరానికి అనుగుణంగా భద్రత చర్యలు చేపడుతున్నారు. దేవాదాయ శాఖ తరపున 54, పోలీసుశాఖ తరపున 70 సిసి కెమెరాలను, 10 డ్రోన్లను ఏర్పాటు చేశారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేసి, వాటిని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేసి, సిసి పుటేజీలను నిరంతరం పర్యవేక్షించనున్నారు. పైడితల్లమ్మ దేవాలయం ఎదురుగా తాత్కాలికంగా కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తారు. సిరిమాను తిరిగే ప్రాంతాల్లో, సిరిమాను తీసుకొని వచ్చే మార్గంలో, ఇతర ముఖ్య కూడళ్లలో 124 సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందికి కూడా బాడీ వార్న్ కెమెరాలను ధరింపజేస్తారు. భద్రతను నిరంతరం పర్యవేక్షించే విధంగా పది డ్రోన్లు కూడా వినియోగిస్తున్నారు. ఈ కమాండ్ కంట్రోల్ రూంలో ఏర్పాటుచేసిన బిగ్‌స్క్రీన్లకు బందోబస్తులో పోలీసులు ధరించిన బాడీ వార్న్ కెమెరాలను, సిసి కెమెరాలను, డ్రోన్ కెమెరాలను అనుసంధానం చేస్తారు. తద్వారా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా ఏర్పాటు చేసి, భద్రతను పర్యవేక్షిస్తారు.

సిరిమానోత్సవం రోజున నగరంలో 9 ప్రాంతాల్లో రాకపోకలను నిషేధించారు. వాహన పార్కింగ్ కోసం 18 చోట్ల ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకంగా 848మంది పోలీసు సిబ్బందిని, అధికారులను కేటాయించారు.

రూఫ్ టాప్‌లు ఏర్పాటు

సిరిమాను తిరిగే మార్గంలో ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో రూఫ్‌టాప్‌లో పోలీసులను నియమించి, నిఘా ఏర్పాటు చేశారు. ఇక్కడ విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది బైనాక్యులర్లతో సిరిమాను తిరిగే ప్రాంతాలను పరిశీలిస్తూ, అవసరమైన సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ రూంకు తెలియజేసి, పోలీసులను



డాగ్ స్క్వాడ్‌తో తనికీలు చేస్తున్న పోలీసులు

అప్రమత్తం చేస్తారు. సిరిమాను తిరిగే ప్రాంతాలకు దగ్గరలో శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి, ఆయా భవనాల మీదకు ఎవరినీ అనుమతించవద్దని, యజమానులకు ఇప్పటికే పోలీసులు నోటీసులు జారీ చేశారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక క్రైమ్ బృందాలు

నేరాలను నియంత్రించేందుకు నేరస్తులను గుర్తించడంలో అనుభవజ్ఞులైన క్రైమ్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ఆలయం, రద్దీ ప్రాంతాల్లో మఫ్టీలో తిరుగుతూ జేబు, గొలుసు దొంగతనాలు జరగకుండా చర్యలు చేపడతారు. అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించేందుకు పోలీసు జాగిలాలతోపాటు, ప్రత్యేక బాంబ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దింపారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - తెర్లాం

విద్యార్థులు, పిల్లలు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని స్థానిక శాఖ గ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం గ్రంథాలయంలో పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. చిల్డ్రన్ క్లబ్‌లో భాగంగా విద్యార్థులతో ఆట పాటలు పాడించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా 'డ్రోన్'

ప్రజాశక్తి - పూసపాటిరేగ

విజయనగరం ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో మండలంలోని రెల్లివలస ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన డ్రోన్ ప్రత్యేక ఆకర్షణ నిలిచింది. ఈ డ్రోన్‌ను జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు అదితి ఆసక్తిగా పరిశీలించారు. డ్రోన్ నిర్మాణ విధానం గురించి ప్రధానోపాధ్యాయులు శంకరరావు వివరణ ఇచ్చారు. డ్రోన్ తయారీలో పాల్గొన్న విద్యార్థులను, వారికి మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయుడు ఉమర్ఫారూక్‌ను మంత్రి శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల విద్యార్థులు స్వయంగా డ్రోన్ రూపొందించడం అభినందనీయమని ప్రశంసించారు. ఉత్సవాల్లో విద్యార్థుల సాంకేతిక ప్రతిభ ప్రతిబింబించిన ఈ డ్రోన్ ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది.

వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ అధికార ప్రతినిధిగా లక్ష్మణరావు

ప్రజాశక్తి - నెల్లిమర్ల



మండలంలోని మొయిద విజయరామపురం గ్రామానికి చెందిన ధవళ లక్ష్మణరావును వైసిపి కార్మిక విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియమించారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. పార్టీ ఆవిర్భావం నుంచి లక్ష్మణరావు సేవలందిస్తున్నారు. దివంగత నేత పెనుమత్స సాంబశివరాజు అనుచరుడిగా ఉండేవారు. ప్రస్తుతం సాంబశివరాజు తనయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు అనుచరుడిగా ఉన్నారు. గతంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా కొంతకాలం సేవలందించారు. గత 20 ఏళ్లుగా కార్మిక నాయకుడిగా సేవలందించిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ సురేష్‌బాబు ఆశీస్సులతో జిల్లాలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తనకు అవకాశం ఇచ్చిన యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ రెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావుకు, మాజీ ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడుకు, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడుకు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబాళ్ల శ్రీరాములు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. లక్ష్మణరావుకి నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

సండే సైక్లింగ్

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక 5వ బెటాలియన్‌లో ఫిట్ ఇండియా ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని ఆదివారం ఎపిఎస్‌పి 5వ బెటాలియన్ కమాండెంట్ సిహెచ్‌విఎస్ పద్మనాభరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైక్లింగ్ వల్ల ఆరోగ్యం కాపాడుకోవటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందన్నారు. సైకిల్ వాడకం వల్ల శరీరానికి తగిన వ్యాయామం లభించి, మానసికంగా ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. ఫిట్ ఇండియా ప్రత్యేక కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఆరోగ్య స్ఫూర్తి పెంపొందించడం, యువతలో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడం లక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ జివి. ప్రభాకర్‌రావు, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్. బాపుజీ, డివి రమణమూర్తి, ఎం. గోపాలకృష్ణ, ఆర్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ట్రస్టు వార్షికోత్సవం

రూ.50వేలు ఆర్థిక సాయం అందించిన తహశీల్దార్

ప్రజాశక్తి- కొత్తవలస

మండలంలోని తుమ్మికాపల్లి వినాయక నగర్ వద్దనున్న ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ 13వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు విశ్వనాథ హరికుమార్ మాట్లాడుతూ ప్రతినెలా క్రమం తప్పకుండా దాతల సహాయ సహకారాలతో 45 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసర సరుకులు అందజేస్తున్నామన్నారు. ట్రస్ట్‌కు తహశీల్దార్ అప్పలరాజు 50 వేల రూపాయలు అందజేసినట్లు తెలిపారు. చింతలపాలెం సర్పంచ్ మాకేనా సీతారామ పాత్రుడు (నవీన్) సౌండ్ బాక్సులు అందజేశారన్నారు. 45 మంది ఒంటరి వృద్ధులకు మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు అప్పికొండ శ్రీనివాసరావు నిత్యవసర సరుకులు అందజేశారని చెప్పారు. ట్రస్ట్ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం, రక్తదానం, వస్త్రదానం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సంతోష్ కుమార్, శ్రావణ్ కుమార్, ప్రసాద్, గణేష్, బుజ్జి, చిన్న, కుమార్, గోవింద్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'ఓట్ చోర్ గద్దె చోడ్'కు స్పందన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

'ఓట్ చోర్ గద్దె చోడ్' కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ గేదెల తిరపతి అన్నారు. ఆదివారం ఎస్.కోట పంచాయతీలోని సీతమ్మ పేటలో ఓట్ చోర్ గద్దె చోడ్ కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది ముందుకొచ్చి సంతకాలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మణిబాబు, నానాజీ, చింతల ఈశ్వరరావు, లగుడు శ్రీను, కోడూరు హైమా, సురేష్, లక్ష్మణరావు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానించిన బేబినాయన



తెర్లాం: ఎంపిటిసిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి - బొబ్బిలి

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదివారం నియోజకవర్గంలో పని చేస్తున్న ఉపాధ్యాయులను కోటలో ఎమ్మెల్యే బేబినాయన సన్మానించారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేసి మంచి సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తున్నారని బేబినాయన అన్నారు. గ్రంథాలయ డైరెక్టర్ రౌతు రామమూర్తి మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతిక నైపుణ్యానికి అనుగుణంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని, జాతీయ విద్యా విధానం సూచనలు మేరకు జిడిపిలో 6 శాతం నిధులు విద్యా రంగానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. సమాజంలో ఉపాధ్యాయులకు మంచి గౌరవం ఉన్నప్పటికీ ఉపాధ్యాయ రంగం పట్ల నేటి యువత ఆసక్తి చూపడం లేదని, వారు ఉపాధ్యాయ రంగం వైపు వచ్చేలా ప్రభుత్వ బిఇడి కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. ఆ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి వచ్చేలా బేబినాయన కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు సంఘం నాయకులు కర్రి సత్యనారాయణ, ఎల్.జగన్నాథం, బి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

తెర్లాంలో ఎమ్మెల్యే పర్యటన

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే బేబినాయన ఆదివారం పర్యటించారు. నెమలాం గ్రామంలో మంచినీరు కోనేరు పాడైపోయిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన మరమ్మత్తులు నిమిత్తం రూ.1.50లక్షలు మంజూరు చేసి చెరువును శుద్ధీకరించారు. ఈ చెరువును ఆయన బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎంపిటిసి బోను అప్పలనాయుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసీ చైర్మన్ వెంకట్ నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, నెమలాం మాజీ సర్పంచ్ వెంకటనాయుడు, అమరాపు సురేష్, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బురదమయమైన రహదారి

దారి ఇలా వెళ్లేదెలా?

ప్రజాశక్తి - బొబ్బిలి

రేషన్ షాపులకు రేషన్ సరుకులు సరఫరా చేసే పౌర సరఫరాల గోదాముకు వెళ్లాలంటే లారీ డ్రైవర్లు నరకం చూస్తున్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఉన్న పౌర సరఫరాల గోదాము నుంచి బొబ్బిలి టౌన్ 21, రూరల్ 45, రామభద్రపురం 34 షాపులకు రేషన్ సరుకులు సరఫరా చేస్తున్నారు. గోదాములలో రేషన్ సరుకులు నిల్వ చేసేందుకు సరుకులతో వెళ్తున్న లారీలు, గోదాముల నుంచి రేషన్ షాపులకు సరుకులను తరలిస్తున్న లారీలు గోతులలో కూరుకు పోవడంతో లారీ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే రోడ్డు మొత్తం బురదమయంగా మారుతుంది. రోడ్డు నిర్మాణం చేయాలని డీలర్లు, లారీ డ్రైవర్లు కోరుతున్నారు.

ఆర్ఒబి పనులు పూర్తిచేయండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చీపురుపల్లి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా

గత కొంతకాలంగా రైల్వే బ్రిడ్జి పనులు నత్తనడకన కొనసాగుతూ ఉండడంతో స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు రైల్వే, రోడ్లు భవనాల శాఖ అధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ అధికారులు సమన్వ యంతో పనిచేసి బ్రిడ్జి పనులు వేగవంతం చేసి ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో గల రిక్షా కాలనీ కొత్త అగ్రహారం ప్రాంతాలలో నివాసముంటున్న ప్రజలు వెళ్లేందుకు వీలుగా ఆర్ఒబి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డుని సరిత ఎదుట పూర్తి చేసి ప్రజలకు అందించాలని సూచించారు. రైల్వే బ్రిడ్జి పనులు సందర్భంగా పాడైన తాగునీటి పైపులైన్లను తిరిగి పునరుద్ధరించి చీపురుపల్లి ప్రజలకు తాగునీరుని అందించాలని వారిని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఆర్ ఆండ్ బి కార్యనిర్వహక ఇంజినీర్ ఎం. జేమ్స్, డిఇఇ రవి శేఖర్, ఎఇఇ మురళి బాబు, రైల్వే అధికారులు డి.ప్రకాష్ రావు, ఎస్ఎస్ఇ పివి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతను క్రీడల వైపు మళ్లించాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

యువతను క్రీడల వైపు మళ్ళించి శారీరక, మానసిక వికాసాన్ని పెంపొదించేలా చేయాలని పూసపాటిరేగ ఎఎంసి డైరెక్టర్ మంగం మోహన్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని చౌడువాడలో కీర్తిశేషులు ఇళ్ల సంజీవరావు జ్ఞాపకార్థం ఇళ్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన కుమారులు క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలకు సుమారు 60 వేల రూపాయల విలువైన బహుమతులను మోహన్ రావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ 'క్రీడలు మనోవికాసానికి, శారీరక ధృఢత్వానికి ఎంతో ఉపయోగపడతా యన్నారు. మన ప్రాంత యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. ప్రతి జట్టుకూ క్రికెట్ కిట్లు, వాలీబాల్ సామగ్రి అందించడం అభినందనీ యమని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల సంజీవరావు కుమారులు రమేశ్, సురేష్, మధుసూదనరావు, కొయ్య లక్ష్మణరావు, కోల నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ కిట్లను అందిస్తున్న మోహనరావు, తదితరులు

ఘనంగా దేవీ అనుపోత్సవం

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని వల్లంపూడిలో శనివారం రాత్రి దేవీ నవరాత్రి సందర్భంగా గ్రామ పురవీధుల్లో దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దేవాంగుల చిన్న వీధి యువసేన, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించారు.

విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - వేపాడ

చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహాన్ని అగ్గితో తగలబెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని మండల దళిత మహాసభ అధ్యక్షుడు కోమనపల్లి రాము డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ అటువంటి దుర్మార్గమైన చర్యలు మరల పునరావృతం కాకుండా ఉండాలంటే ఇటువంటి దుర్మార్గానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో దళిత సంఘం నాయకులు డి.బాలసౌరి, పి.అప్పారావు, ఆర్.సన్నిబాబు, ఆర్.యశ్వంత్, గుత్తు శ్రీను, గుడివాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు జనసేన అత్యవసర సమావేశం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పట్టణములోని వెంకటేశ్వర లాడ్జి వద్ద జనసేన పార్టీ అత్యవసర సమావేశం సోమవారం నిర్వహించనున్నామని ఆ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి ఎం.శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఇంచార్జి వబ్బిన సత్యనారాయణ హాజరై రానున్న స్థానిక ఎన్నికలకు సిద్ధమయ్యే విధంగా అభ్యర్థులు అభిప్రాయాలు సలహాలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

దేవి బొమ్మ నిమజ్జనంలో టిడిపి, వైసిపి మధ్య ఘర్షణ

● ఇరు పార్టీల శ్రేణులపై పోలీసుల లాఠీఛార్జీ ● జమ్ము గ్రామంలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - గుర్ల

మండలంలో జమ్మూ గ్రామంలో శనివారం అర్ధరాత్రి దేవి నిమజ్జనం ఘర్షణకు దారి తీసింది. నవరాత్రుల సందర్భంగా టిడిపి, వైసిపి గ్రూపులు వేరు వేరు చోట్ల దేవి బొమ్మను ఏర్పాటు చేశాయి. ఒకే రోజు నిమజ్జన చేయడంతో ఒక్కసారిగా గ్రామంలో అలజడి చెలరేగింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఒకరు వెంట మరొకరు వెళ్లాలని కొంత సమయం తీసుకోవాలని ఇరు గ్రూపులకు పోలీసులు సూచించారు. పైగా నిమజ్జన కార్యక్రమం 10 గంటలలోపే పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే మెయిన్ వీధిలోకి రెండు దేవి బొమ్మలు రావడంతో ఒకరి వెంట ఒకరు వచ్చి తమ పార్టీ అధినాయకులు పాటలు వేసుకొని డ్యాన్సులు ప్రారంభించారు. పార్టీ పాటలు వేయడంతో కొంతసేపటి తరువాత గందరగోళంగా మారింది. దీంతో నిమజ్జన కార్యక్రమం అదుపు తప్పుతుందని గ్రహించిన స్థానిక పోలీసులు సిఐకు సమాచారం ఇచ్చారు. దీంతో చీపురుపల్లి సిఐ శంకర్రావు అర్ధరాత్రి పోలీసులను తన వెంట తీసుకుని ఘటనా స్థలానికి చేరుకు న్నారు. ఇరు గ్రూపులకు నచ్చ చెప్పారు. వెంటనే ఇక్కడ నుంచి దేవీ బొమ్మలను తీసుకువెళ్లాలని చెప్పడంతో ఇరు గ్రూపులు కూడా తమకు కొంత సమయం కావాలని ఎవరు ముందుకు వెళ్లలేదు. సమయం ఒంటిగంట దాటిపోయిన ఎవ్వరు ముందుకు కదల్లేదు. పోలీసులు అసహనంతో జనాలను లాఠీ ఛార్జ్ చేసి చెదర గొట్టారు. దీంతో సారంపాటి ఆనందరావుకు దెబ్బలు తగలడంతో ఆయనను వెంటనే అక్కడి నుంచి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతంలో ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. పోలీసులే తమను కొట్టారు తప్ప రెండు గ్రూపుల మధ్య ఎటువంటి కొట్లాట జరగలేదని గ్రామస్తులు తెలిపారు. పోలీసులు ఓవరాక్షన్ వల్లే కొంతమందికి దెబ్బలు తగిలాయని చెప్పారు.

దీనిపై సీఐ శంకర్రావును వివరణ కోరగా తన కానిస్టేబుళ్లను కొంతమంది వ్యక్తులు పట్టుకొని కొట్టడంతో అక్కడికి వెళ్లి విడిపించడంతో గందరగోళం జరిగిందని అందుకే అక్కడి నుంచి జనాలను చెదరగొట్టామని చెప్పారు. ఏది ఏమైనా గ్రామంలో గత కొంత కాలం నుంచి ప్రతి చిన్న విషయానికి గ్రామ పెద్దలు తమ వ్యక్తిగత కారణాలతో గ్రామంలో అలజడి సృష్టిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఎటువంటి వివాదాలూ లేవని గ్రామం ప్రశాంతంగా ఉందని పోలీసులు తెలిపారు.

ఆటోపై చెట్టు పడి ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని తుమ్మకాపల్లి అగ్నిమాపక శాఖ కేంద్రం వద్ద భారీ వర్షానికి ఆదివారం సాయంత్రం ఆటోపై చెట్టు కూలి ముగ్గురికి గాయాలయ్యాయి. విశాఖపట్నం నుంచి ఎస్‌కోట ఆటోలో వెళుతున్న సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఫైర్ ఆఫీసు వద్దకు వచ్చేసరికి ఆటోపై చెట్టు కూలడంతో మండలంలోని వెంకటరమణపేటకు చెందిన ఆటో డ్రైవర్ ఎర్రినాయుడు, ఎస్.కోటకు చెందిన కోలా సన్యాసినాయుడు, వెంకటలక్ష్మిల తలకు తీవ్ర గాయాలయ్యాయి. తక్షణమే వీరిని ఎస్.కోట ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వీరి ఆరోగ్యం నిలకడగానే ఉంది. కూలిన చెట్లను ఫైర్ సిబ్బంది హుటాహుటిన తొలగించారు.



ఆటోపై పడిన చెట్టు కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

నేరాలు ఘోరాలు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని కొల్లిపేట గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన కొల్లి సన్యాసిరావు తన కుమార్తె కావ్య (ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని) శనివారం రాత్రి నుంచి కనిపించడం లేదని ఆదివారం భోగాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాత్రి 10.30 గంటల సమయంలో తండ్రి లేచి చూసే సరికి కుమార్తె కనిపించకపోవడం, చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సూర్యకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.